మిషన్ భగీరథ నీళ్లు బంద్

- పలు గ్రామాల్లో నిలిచిపోయిన నీటి సరఫరా
- ఐదు రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అర్వపల్లి : గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్ల సక్రమంగా రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నెలలో వారం రోజులపాటు నీళ్లు నిలిచిపోగా.. తాజాగా మళ్లీ ఐదు రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు బందయ్యాయి. దీంతో గ్రామీణులు నిత్యం అవస్థలు పడుతున్నారు. పాలేరు రిజర్వాయర్ వద్ద విద్యుత్ సమస్యతో నీటి సరఫరా నిలిచిపోయిందని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు.

రోజుల తరబడి సమస్య..

గ్రామాల్లో ప్రజలకు ప్రధానంగా మిషన భగీరథ నీళ్లే ఆధారం. మిషన్ భగీరథ పథకం మొదలయ్యాక రక్షిత మంచినీటి పథకాలు ఎక్కడ కూడా పనిచేయడం లేదు. పూర్తిగా భగీరథ నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే గతనెలలో వారం రోజులతోపాటు నీటి సరఫరా నిలిచిపోగా..



అర్వపల్లిలోని మిషన్ భగీరథ ట్యాంక్

మళ్లీ ఐదు రోజుల నుంచి నీటి సమస్య ఏర్పడింది. పాలేరు నుంచి నీళ్లు రాకపోవడంతో గ్రామాల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలు నీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు బతుకమ్మ ఉత్సవాలు, దేవీ శరన్నవరాత్రోత్సవాలు జరుగుతుండగా దసరా పండుగ సమీపిస్తోంది. దీంతో గ్రామాల్లో నీటి వాడకం పెరిగింది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీటి సమస్య పరిష్కరించాని, ప్రతిరోజూ భగీరథ నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి సరఫరా సరిగా లేదు



మిషన్ భగీరథ పథకం మొదలైనప్పటి నుంచి నీటి సరఫరా సరిగా జరగడం లేదు. తరచూ పాలేరు, చిల్పకుంట్ల ప్లాంట్ల వద్ద సమస్యలు తలెత్తి నీళ్లు రావడం లేదు. అలాగే పైప్‌లైన్లు కూడా సరిగా లేవు. అధికారులు స్పందించి నీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలి.

– వజ్జె శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి

మాటిమాటికీ నిలిచిపోతున్నాయి



మిషన్ భగీరథ నీళ్లు మాటిమాటికీ బందవుతున్నాయి. దీంతో పలు గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడుతోంది. ఐదు రోజుల నుంచి నీళ్లు రావడంలేదు. నీటి కోసం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– బందెల వెంకన్న, సీతారాంపురం

క్లుప్తంగా

మాజీ మంత్రిని కలిసిన నూతన కమిటీ సభ్యులు



దామోదర్ రెడ్డిని కలిసిన నాయకులు

భానుపురి : సూర్యాపేట పట్టణ ఆరె కటిక సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు జమల్‌పురి పండరినాథ్, ప్రధాన కార్యదర్శి జమల్‌పురి రవీందర్‌లతో పాటు నూతన కమిటీ సభ్యులు ఆదివారం మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీఆర్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు కామ్లేకర్ శంకర్ లాల్, జలల్‌పురి సజన్ లాల్, ఉపాధ్యక్షుడు విఠల్, కోశాధికారి సురేష్, సహాయ కార్యదర్శి కె.రఘు మోహన్, కార్యవర్గ సభ్యులు రాజేష్, విజయ్, సంతోష్, శివ, శేఖర్, శ్రీనివాస్, మహేష్, అశోక్, రామచందర్, బాబి, క్రిష్ణ, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలు అరికట్టాలి

అర్వపల్లి : మండల వ్యాప్తంగా గ్రామాల్లో రోజురోజుకూ పెరిగిపోతున్న బెల్టు దుకాణాలను అధికారులు వెంటనే అరికట్టాలని పూలే, అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఏ గల్లీలో చూసినా పెద్ద సంఖ్యలో బెల్టు దుకాణాలు ఉన్నాయని చెప్పారు. అధికారులు బెల్టు దుకాణాలను మూసివేయించి గ్రామాలు ప్రశాంతంగా ఉండేలా చూడాలని కోరారు.

ఈదురు గాలులు.. వర్షం



అర్వపల్లిలో కురుస్తున్న వర్షం

అర్వపల్లి : అర్వపల్లిలో ఆదివారం మధ్యాహ్నం ఈదురుగాలితో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలి వచ్చి ఇళ్లు, దుకాణాల పైకప్పులు, బోర్డులు లేచిపోయాయి. అలాగే అరగంటపాటు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరికి గాయాలు

తుంగతుర్తి : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన తుంగతుర్తి మండలం అన్నారం గ్రామ శివారులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామానికి చెందిన గుండగాని మల్లయ్య శనివారం సాయంత్రం అన్నారం గ్రామంలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. అన్నారం గ్రామ సమీపంలోకి వెళ్లగానే తుంగతుర్తి వైపు బైక్‌పై వెళ్తున్న ఏసురత్నం ముందు వెళ్తున్న ఆటోను తప్పించి ఎదురుగా వస్తున్న మల్లయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గుండగాని మల్లయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మద్దిరాల : గోరెంట్లలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మద్దిరాల : మండల పరిధిలోని గోరెంట్ల గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ 1997–2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు చదువు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు జలగం మహేష్, కంచం నాగయ్య, రాజబోయిన రాకేష్, వగలగాని మల్లేష్, నలమాస సతీష్, శోభ, సుధారాణి, స్వరూప, పవిత్ర, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : అనంతారంలో..

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గురువులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి, పూర్వ ఉపాధ్యాయులు ఒంటెద్దు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నారాయణ, పుల్లయ్య, వీరయ్య, వెంకట్‌రెడ్డి, రాజేందర్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేకు ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేకనే ఆరోపణలు’

నూతనకల్ : తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కొంతమంది నాయకులు ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకుడు ఇరుగు కిరణ్ అన్నారు. ఆదివారం మిర్యాల గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు సముచితస్థానం కల్పిస్తున్న ఎమ్మెల్యేను కావాలనే కొన్ని వర్గాల వారు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికైనా నాయకులు ఆలోచించి వర్గాలకు అతీతంగా నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇరుగు మల్లేష్, నాగరాజు, వెంకటేష్, ప్రశాంత్, వేణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరుపై హర్షం

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తిరుమలగిరికి మంజూరు చేయడంపై కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో మంజూరైన 19 పాఠశాలల్లో తుంగతుర్తి నియోజకవర్గానికి ఒక స్కూల్‌ను కేటాయించడంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాఠశాల ద్వారా కేజీ టూ పీజీ వరకు విద్యార్థులకు ఉచిత విద్య అందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దరావత్ జమ్మిలాల్, తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ నిర్మాణ స్థలం పరిశీలన



తొండ గ్రామంలో స్థలాన్ని పరిశీలిస్తున్న గౌతమ్‌రావు, తదితరులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తొండ గ్రామం మీదుగా వెళ్తున్న 930పీ నేషనల్ హైవేపై తొండ గ్రామ బస్టాండ్ సమీపంలో అండర్‌పాస్ నిర్మించాలని గ్రామస్తులు కోరగా భారతీయ జనతా పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు నెమురుగొమ్ముల గౌతమ్‌రావు ఆదివారం రోడ్డు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ ప్రజల సౌకర్యార్థం అండర్‌పాస్ నిర్మించాలని గతంలోనే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ నెల 9న గ్రామస్తులతో వెళ్లి కిషన్‌రెడ్డిని కలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వాసిరెడ్డి గోపాల్‌రెడ్డి, రామారావు, చంద్రయ్య, సాయి, కోటయ్య, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న తిరుమలప్రగడ అనురాధ

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్‌రావు అన్నారు. ఆదివారం చందుపట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన మహిళా కార్యకర్తల సభ్యత్వ నమోదులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పచ్చిపాల సుమతీ వెంకన్న, పార్టీ గ్రామ అధ్యక్షుడు తీకుల సుధాకర్ రెడ్డి, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము వెంకన్న, కొమ్ము అంజయ్య, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు అదుపుచేయాలి



మాట్లాడుతున్న యాదగిరిరావు

అర్వపల్లి : రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువులతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు కోరారు. మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన సీపీఎం మహాసభలో పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు విలవిలలాడుతున్నారని చెప్పారు. నిత్యావసరాల ధరలు పెరగడంతో ప్రజలు పండుగలు కూడా చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. అనంతరం సీపీఎం గ్రామ కార్యదర్శిగా అరిగె నరేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి, మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, శిగ వెంకన్న, వజ్జె సైదులు, బొడ్డు సైదులు, అబ్బులు, కొమ్ము విజయ్, ఎస్.వెంకన్న, బి.వెంకటేష్, ఎ.సురేష్, రాజు, నర్సయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై విచారణ



అర్వపల్లిలో విచారణ చేస్తున్న అధికారులు

అర్వపల్లి : ఎల్ఆర్ఎస్ కింద భూములు పట్టా చేసుకోవడానికై ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులపై ఆదివారం జాజిరెడ్డిగూడెం, అర్వపల్లిలలో గ్రామ పంచాయతీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు విచారణ చేపట్టారు. భూమికి సంబంధించిన పూర్తి వివరాలు, దస్తావేజులను దరఖాస్తుదారులు చూపించాలని అధికారులు కోరారు. కాగా అర్వపల్లిలో 191, జాజిరెడ్డిగూడెంలో 91, రామన్నగూడెంలో 1 చొప్పున దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, నీటిపారుదల శాఖ ఏఈ హరిస్వరూప్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్, టెక్నికల్ అసిస్టెంట్ దీపిక, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

నూతనకల్ : బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. తాళ్లసింగారంలో ఇటీవల మృతి చెందిన మరికంటి వీరస్వామికి బీఆర్ఎస్‌లో క్రియాశీలక సభ్యత్వం ఉండటంతో మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు చూడి లింగారెడ్డి, గాజుల తిర్మల్‌రావు, గుగులోతు నర్సింగ్‌నాయక్, బత్తుల సాయిలుగౌడ్, గాద్దల లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

నూతనకల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహేశ్వరం మల్లిఖార్జున్ ఇటీవల ప్రమాదవశాత్తు జారి పడడంతో కాలువిరిగి చికిత్స పొందుతున్నాడు. దీంతో అతడిని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆదివారం నకిరేకల్‌లో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, బత్తుల సాయిలుగౌడ్, గాజుల తిర్మల్‌రావు, రేసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పస్తాల–వెలిశాల బీటీ రోడ్డు మరమ్మతు చేపట్టాలి

నాగారం : పస్తాల నుంచి వెలిశాల ఎక్స్‌రోడ్డు వరకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పస్తాల – వెలిశాల బీటీరోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకరతేలిందన్నారు. గుంతల రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పస్తాల శివారులో కల్వర్టు వద్ద బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు గుడపూడి వెంకటేశ్వర్లు, మొల్కపురి మహేందర్, కండె భిక్షం, సత్తయ్య, అంజయ్య, పద్మ, స్వరూప, యాదమ్మ, నాగయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు వికాస్‌పాండే, శ్రీరాం పాండే, అంకిత్‌పాండే పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెంలో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, గ్రామస్తులు

అర్వపల్లి : హైదరాబాద్‌కు చెందిన రజనీ కార్పొరేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం జాజిరెడ్డిగూడెంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్.రజినీకుమారి ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రఘు, జాగతి, రమేష్, రేష్మా, గ్రామస్తులు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా శ్రీసంతోషి మాత



సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



లలితా త్రిపుర సుందరీదేవిగా..

సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు ఆదివారం సంతోషిమాత అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. శ్రీలలితా మాతకు దేవాలయ అర్చకుడు వట్టారం వంశీకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీలలితా మాత అలంకరణ దాతలకు సామూహికంగా శ్రీ చక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. నవరాత్రులను పురస్కరించుకొని చండీ హోమం, రుద్ర హోమంతో పాటు బ్రాహ్మణ ముత్తయిదువకు సుహాసిని పూజ నిర్వహించారు. చిన్నారులు దేవత వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసంతోషిమాత దేవాలయం అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, పాలవరపు రామమూర్తి, నరేంద్రని విద్యాసాగర్ రావు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, ముదిరెడ్డి లింగారెడ్డి, నూక రవిశంకర్, బ్రహ్మాండ్లపల్లి శివప్రసాద్, బోనగిరి విజయ్ కుమార్, కక్కిరేణి పద్మ, కర్నాటి సూర్య కళ, బ్రాహ్మణపల్లి శివపార్వతి, నూక భవానిరాణి, ముదిరెడ్డి ప్రభావతి, లకుమారపు పద్మజ, కనకరత్నం జగదీశ్వరి, దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



వీరసోములు

అర్వపల్లి : ఎరువులు, విత్తనాల దుకాణదారుల జాజిరెడ్డి గూడెం మండల కమిటీని ఆదివారం అర్వపల్లిలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నల్ల రామచంద్రయ్య, మండల అధ్యక్షుడిగా బోయపల్లి వీరసోములు, ప్రధాన కార్యదర్శిగా పాలబిందెల జాని, కోశాధికారిగా ఖమ్మంపాటి నరేష్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుగులోతు సుధాకర్, హుస్సేన్‌నాయక్, లొడంగి నాగరాజు, కె.శ్రీనివాస్, కె.నాగరాజు, లింగరాజు, లింగస్వామి, జనార్దన్, నర్సింహ, దిలీప్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

పురుషోత్తంరెడ్డికి నివాళి

అనంతగిరి : గొండ్రియాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని పరామర్శించారు. వారిలో గొట్టిముక్కుల బాబురావు, ఏటుకూరి రమేష్, చుంచు మురళి, శేషగిరిరావు, బండ్ల మల్లయ్య, బట్ట వలరాజు ఉన్నారు.

కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గామాత లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చింది. మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



తిరుమలగిరిలో పూజలు చేస్తున్న గాదరి కిషోర్‌కుమార్, తదితరులు



పెన్‌పహాడ్ : అనాజిపురంలో అన్నదానం..



మద్దిరాల : కుక్కడంలో పూజలు..



తుంగతుర్తిలో..



నూతనకల్ : చిల్పకుంట్లలో పూజలు చేస్తున్న భక్తులు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో..

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బతుకమ్మ వేడుకలు



బహుమతులు అందజేస్తున్న పటేల్ రమేష్ రెడ్డి

సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో 5వ రోజు బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా పక్షపాతిగా వ్యవహరిస్తుందన్నారు. అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను అలంకరించిన మహిళలను ఆయన అభినందించారు. బతుకమ్మలు అందంగా పేర్చి ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. మొదటగా బతుకమ్మలు తీసుకువచ్చిన 100 మందికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెలుగు వెంకన్న, నాయకులు గట్టు శ్రీనివాస్, ముదిరెడ్డి రమణారెడ్డి, నేరెళ్ల మధుగౌడ్, దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శింగిరికొండ రవీందర్, ఈగ వెంకటేశ్వర్లు, గుండా శ్రీధర్, చల్లా లక్ష్మీకాంత్, పోల రాధాకృష్ణ, చిలుకల శ్రీనివాస్, సింగిరికోడ ప్రదీప్, పబ్బతి వేణుమాధవ్, తల్లాడ సోమన్న, చిలుకల స్వాతి, గుండా ఉపేందర్, గుండా సుధా మాధురి, సోమా లక్ష్మి, లకుమారపు పద్మజ తదితరులు పాల్గొన్నారు.